# ప్రజాశక్తి

మంగళవారం 4 ఏప్రిల్ 2023

5






## గిరిజన విద్యార్థులకు ఎంసెట్ కోచింగ్

**ప్రజాశక్తి-జి. మాడుగుల :** మండలంలో గురుకుల కళాశాలల్లో చదివే బాలురుకు జి. మాడుగుల ఎపిఆర్ కళాశాలలో ఎంసెట్ కోచింగ్ ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ పారయ్య తెలియజేశారు. రంపచోడవరం ఐటిడిఎ పరిధిలోని చింతూరు, జీలుగుమిల్లి. విఆర్ పురం, మారేడుమిల్లి, అడ్డతీగల, రంపచోడవరం, పాడేరు డివిజన్ పరిధిలోని అరకు, పెదబయలు, జి మాడుగుల, చింతపల్లి, కొయ్యూరు కళాశాలల్లో ఎంపిక చేసిన 160 మంది విద్యార్థులకు వచ్చేనెల 16 వరకు కోచింగ్ ఇవ్వనున్నట్లు ఆయన తెలియజేశారు.



కోచింగ్ ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ పారయ్య

# అల్లూరి జిల్లాకు నేటితో ఏడాది!

- రెండు డివిజన్లతో ప్రత్యేక గిరిజన జిల్లా ఆవిర్భావం..
- పరిపాలనా సౌలభ్యం పాడేరు డివిజన్‌కే పరిమితం
- రంపచోడవరం ప్రత్యేక జిల్లా ఏర్పాటుకు డిమాండ్

**ప్రజాశక్తి పాడేరు:** అల్లూరి సీతారామరాజు జిల్లా ఆవిర్భవించి ఏప్రిల్ నాలుగో తేదీకి ఏడాది పూర్తయింది. పాడేరు కేంద్రంగా పాడేరు, రంపచోడవరం డివిజన్లతో ప్రత్యేక గిరిజన జిల్లాగా ఆవిర్భవించింది. జిల్లాలో రెండు డివిజన్ల పరిధిలోని 22 గిరిజన మండలాలు అటవీ ప్రాంతంలోనే ఉన్నాయి. కొత్త జిల్లాల ఏర్పాటుతో పరిపాలన సౌలభ్యం కలుగుతుందని ప్రభుత్వం వెల్లడించింది. అయితే అల్లూరి జిల్లా ఆవిర్భావం వల్ల పరిపాలన సౌలభ్యం పాడేరు డివిజన్‌కు పరిమితంగా కాగా, పూర్వం తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న రంపచోడవరం డివిజన్‌లోని 11 మండలాలకు జిల్లా మార్పు జరిగిందే తప్ప, పాలన చేరువ కాలేదనే అభిప్రాయం వ్యక్తమౌతోంది. దీంతో అల్లూరి జిల్లా ఆవిర్భావం తర్వాత కూడా గత ఏడాదిగా రంప చోడవరం డివిజన్ ప్రజలు, ప్రజాప్రతినిధులు తమకు ప్రత్యేక జిల్లా కావాలనే నినాదం లేవనెత్తారు.

రంపచోడవరం డివిజన్ పరిధిలోని ప్రజలు, అధికారులు, నేతలకు పాడేరు జిల్లా కేంద్రానికి సరైన రవాణా సౌకర్యం లేక నేటికీ ఇబ్బంది పడే పరిస్థితి ఉంది. ఆయా ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి ప్రజాప్రతినిధులు, ప్రజలు రాలేని పరిస్థితి కారణంగా జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ వారం, పది రోజులకు ఒకసారి ఆయా మండలాల్లో పర్యటిస్తున్నారు. అల్లూరి జిల్లాలో రోడ్లు, రవాణా వ్యవస్థ లేని కారణంగా అల్లూరి జిల్లా పేరులో ఆదర్శం ఉట్టి పడుతున్నప్పటికీ, అభివద్ధిలో ఒక్క అడుగు ముందుకు వేయని పరిస్థితి లేదు. విశాఖ ఉమ్మడి జిల్లాలో పాడేరు డివిజన్ గిరిజన ప్రాంతం, అటు తూర్పుగోదావరి జిల్లాలోని రంపచోడవరం డివిజన్ గిరిజన ప్రాంతం ఐటిడిఎ కేంద్రాలుగా అభివృద్ధిలో ప్రత్యేకత, ప్రాధాన్యతను కలిగి రాష్ట్రంలోనే ముందంజలో ఉండేవి. రెండు జిల్లాల్లోనూ పాడేరు, రంపచోడవరం డివిజన్లు తలమానికంగా ఉండేవి. అయితే జిల్లాల పునర్విభజన తర్వాత కొత్త. జిల్లా ఆవిర్భావం తరువాత ప్రభుత్వ విధాన రమైన పాలనా విస్తరణ వంటి చర్యలు మినహా, గత ఏడాదికాలంలో ఈ రెండు డివిజన్లలోని గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధిలో వెనుకబాటు కనిపిస్తోంది. నవరత్నాలు లాంటి సంక్షేమ పథకాలకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తున్న క్రమంలో, చెప్పుకోదగ్గ సాగు, తాగునీరు, రహదారులు, వంతెనలు వంటి భారీ ప్రాజెక్టులు, అభివృద్ధి పథకాలు మన్యంలో ఏర్పాటుకు నోచుకోలేదు.



పాడేరు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం

### గిరిజనుల ముంగిట జిల్లా కలెక్టర్...

అల్లూరి జిల్లా ఆవిర్భావంతో సాక్షాత్తు జిల్లా కలెక్టర్ గిరిజనులకు, గిరిజన ప్రజాప్రతినిధులకు అందుబాటులోకి వచ్చారు. గతంలో జిల్లా కలెక్టర్‌ను కలుసుకోవాలంటే పాడేరు ఏజెన్సీ నుంచి విశాఖకు, ప్రజాప్రతినిధులు ప్రజలు సైతం వెళ్లేందుకు అవస్థలు పడే పరిస్థితి ఉండేది. జిల్లా ఆవిర్భావం తర్వాత ఇప్పుడు ఇటు ఉద్యోగులు ప్రజాప్రతినిధులు జిల్లా కలెక్టర్ కలుసుకునేందుకు చాలా సౌలభ్యం ఏర్పడింది.ఇదే సమయంలో రంపచోడవరం డివిజన్‌కు మాత్రం కలెక్టర్ చేరువలోకి రాదనే చెప్పాలి. మునుపు కాకినాడ వెళ్లేవాళ్లంతా, ఇపుడు పాడేరు వెళ్లేందుక ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది.
గిరిజనుల సంక్షేమానికి ఐటిడిఎలు ఆవిర్భవించిన తర్వాత గడచిన 50 ఏళ్లలో దాదాపు 50 మంది ఐఎఎస్ అధికారులకు ప్రాజెక్టు అధికారులుగా వచ్చి గిరిజన సంక్షేమానికి కృషి జరిపారు. ఇప్పుడు జిల్లా కలెక్టర్‌తో పాటు సుమారు 15 శాఖల జిల్లా స్థాయి అధికారులు గిరిజనుల సేవలో చేరువయ్యారు.

### ఆశించిన పురోభివృద్ధి జరగలేదు..



అభివృద్ధి, పరిపాలన సౌలభ్యం కోసమే జిల్లాల పునర్విభజన అన్న ప్రభుత్వ ప్రకటనకు, ఆచరణకు పొంతన లేదు. ప్రభుత్వ అధికారులు నేటికీ పూర్తిస్థాయిలో లేరు. నిధులు కేటాయింపు లేదు. ఉద్యోగులకు నివాస గృహాల ప్రతిపాదన నేటికీ చేయలేదు. కొత్త జిల్లాలో గిరిజన హక్కులు, చట్టాలు పకడ్బందీగా అమలు జరుగుతాయని ఆశించినా, ప్రభుత్వ నిరంకుశ విధానాల బాటలోనే అధికారుల బాధ్యతారాహిత్యం స్పష్టంగా ఉంది. పోలీసుల నిర్బంధం, నిఘా నీడలో గిరిజన జిల్లా ఉంది.
కొత్త జిల్లాలో అటవీసంరక్షణ చర్యలు మృగ్యం కాగా, అభివృద్ధి ముసుగులో ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా హైడ్రో పవర్ ప్రాజెక్టులకు ప్రభుత్వం అనుమతులిచ్చేసింది. పర్యాటకంపై పెరిగిన పర్యావరణ కాలుష్యనియంత్రణ చర్యల్లేవు. జిల్లాల ఏర్పాటుతో పరిపాలన వికేంద్రీకరణ చేసినా, అమలులో ప్లాన్ లేదు. ఐటిడిఎకున్న అధికారాలు అమలు కావడం లేదు. గిరిజన చట్టాలు, హక్కుల ఉల్లంఘనలు, రద్దులు యథేచ్ఛగా సాగాయి.

**పి. అప్పలనర్స,**
**జాతీయ కార్యవర్గ సభ్యులు, గిరిజన సంఘం.**

### జిల్లా పాలన చేరువైంది



పాడేరు జిల్లా ఆవిర్భావంతో పరిపాలన సౌలభ్యం కలిగింది. సమస్యలను నేరుగా జిల్లా కలెక్టర్‌కు వివరించి పరిష్కరించుకోగలుగుతున్నాం. కలెక్టర్ సుమిత్‌కుమార్ కూడా స్పందించి, సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నారు మూడు పంచాయతీలకు కలెక్టర్ వచ్చి రూ.4లక్షలతో పాఠశాల భవన మరమ్మతులు చేయించారు. రూ.8లక్షలతో రోడ్డు నిర్మాణం, గెడ్డ మరమ్మతులకు నిధులు మంజూరుకు హామీనిచ్చారు.

**సీదరి రాంబాబు, సర్పంచ్,**
**డి.గొందూరు పంచాయతీ**

# బోయ, వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దు

## సిపిఎం సర్పంచ్‌ల చొరవతో మండల పరిషత్తు సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం

**ప్రజాశక్తి-రాజవొమ్మంగి**

రాయలసీమ ప్రాంతంలో బిసి ఎ జాబితాలో ఉన్న బోయ, వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దని రంపచోడవరం మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపిపి గోము వెంకటలక్ష్మి అధ్యక్షతను మండల సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఈ నేపథ్యంలో బోయ, వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చుతూ అసెంబ్లీలో వైసిపి ప్రభుత్వం తీర్మానం చేయడాన్ని వ్యతిరేకిస్తూ గిరిజన సంఘం, ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయం ఆందోళన చేపట్టారు. నిరసన కార్యక్రమం ఒక వైపు కొనసాగుతుండగా, మరో వైపు సిపిఎంకు చెందిన లోదొడ్డి, చికిలింత, కొండపల్లి సర్పంచ్‌లు లోతా రామారావు, కోండ్ల సూరిబాబు, కుంజం జగన్నాథం మండల సమావేశంలో బోయ, వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చొదని కోరుతూ తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో ఎంపిపి గోము వెంకటలక్ష్మి బోయ, వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చకూడదని తీర్మానం ప్రవేశ పెట్టగా, పార్టీలకు అతీతంగా జెడ్‌పిటిసి ఒడుగుల జ్యోతి, వైస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. దీంతో ఎంపిడిఒ కార్యాలయం బయట చేపట్టిన ఆందోళన విరమించారు.

దీనికి ముందు గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు, లోదొడ్డి సర్పంచ్ లోతా రామారావు మాట్లాడుతూ ఒక తెగనుగానీ, సమూహాలను గానీ షెడ్యూల్ తెగలుగా గుర్తించేందుకు లోకూర్ కమిటీ కొన్ని ప్రమాణాలను నిర్దేశించిందని తెలిపారు. దాని ప్రకారం ఆహార సేకరణ, పోడు వ్యవసాయం, ప్రత్యేక సంస్కృతీ, సంప్రదాయాలు, భాష, ఆచార వ్యవహారాలు, విశ్వాసాలు, కళలు, ప్రత్యేక నివాసిత ప్రాంతం, విద్య, ఆరోగ్యం, ఆదాయం, వెనుకబాటుతనం వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాల్సి ఉందని తెలిపారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇవేవీ పట్టించుకోలేదని, వాటిని గాలికొదిలేసి, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి శామ్యూల్ ఆనందకుమార్ సిఫార్సుల ప్రకారం తీర్మానం చేసిందని చెప్పారు. పరిశోధన సంస్థను సంప్రదించక పోగా, కనీసం ఆ సంస్థ నుంచి ఏ సమాచారమూ, సూచననూ తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంత్రోపాలాజికల్ సర్వే నిర్వహించకుండా ప్రభుత్వం ఏకపక్షంగా ఇచ్చిన నివేదికకు విలువవుండదని మేధావులు అంటున్నారని పేర్కొన్నారు. గిరిజన తెగకు ఉండవలసిన ప్రాథమిక ఆధారాలేవీ బోయ, వాల్మీకిలకు లేనప్పటికీ ఎస్‌టి జాబితాలో చేర్చాలని తీర్మానం చేయడం గిరిజనులకు అన్యాయం చేయడమే అవుతుందన్నారు. పైగా గిరిజన సలహా మండలి తీర్మానం కూడా లేదన్నారు. బోయ వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చే తీర్మానంపై గిరిజన ఎమ్మెల్యేలు, ఎంపీలు అభ్యంతరం చెప్పకపోవడం దారుణమన్నారు. గతంలో వైఎస్.రాజశేఖరరెడ్డి, చంద్రబాబు ప్రభుత్వాలు బోయ, వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చాలని ప్రయత్నించి, గిరిజనుల వ్యతిరేకతతో వెనక్కి తగ్గారని గుర్తు చేశారు. గిరిజనుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఉన్నప్పటికీ ఈ ప్రభుత్వం తీర్మానం చేసి ఆదివాసీలపై దాడికి దిగిందని విమర్శించారు. ఈ నిరసన కార్యక్రమంలో గిరిజన సంఘం, ఆదివాసీ జేఏసీ నాయకులు వంతు బాలకృష్ణ, తాము సూరిబాబు, ఎస్ అచ్చారావు, బి రామకృష్ణ, వజ్రపు అప్పారావు, వై లక్ష్మణ్, పెద్ద సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.



తీర్మానం చేయాలని కోరుతున్న సిపిఎం సర్పంచ్‌లు లోతా రామారావు, కె.సూరిబాబు, కె.జగన్నాథం



ఎంపిడిఒ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు, గిరిజనులు

### ఎమ్మెల్యే రాజీనామా చేయాలి

**కూనవరం :** బోయ, వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై అభ్యంతరం చెప్పని గిరిజన ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేయాలని గిరిజన సంఘం డిమాండ్ చేసింది. గిరిజన సంఘం కూనవరం మండల కమిటీ సమావేశం తెల్లం తమ్మయ్య అధ్యక్షతన మార్తా శ్రీరామ్మూర్తి భవన్‌లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య మాట్లాడుతూ ఈ విషయంపై స్థానిక గిరిజన ఎమ్మెల్యే ఇప్పటి వరకు నోరు విప్పకపోవడం సిగ్గు చేటన్నారు. గిరిజనులకు అన్యాయం జరుగుతుంటే మాట్లాడని ఎమ్మెల్యే గిరిజన ప్రాంతాలలో ఎలా తిరుగుతారని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాజీనామా చేసి పోరాటంలోకి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాయం సీతారామయ్య, మడకం జ్యోతి, మడకం పొద్దయ్య, రమేష్ అమ్మాజి, జోడే రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ప్రారంభమైన 'పది' పరీక్షలు




పాడేరు పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల హడావిడి

### రాజవొమ్మంగిలో తెలుగు పేపరు తారుమారు

### జిల్లావ్యాప్తంగా తొలి రోజు 115 మంది గైర్హాజరు

**ప్రజాశక్తి-పాడేరు టౌన్:** అల్లూరి జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా మొదలయ్యాయి. 63 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 11,053 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 10,938 మంది హాజరయ్యారు. మొదటి రోజు 115 మంది గైర్హాజరయ్యారు. విద్యార్థులు ఉదయం 8.15 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. వారిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత 9 గంటలకు పరీక్ష కేంద్రాల లోపలికి అనుమతించారు. 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమై మధ్యాహ్నం 12.45 గంటలకు ముగిసింది. పరీక్ష కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు. కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేశారు.

**పాడేరులో ముగ్గురు గైర్హాజరు..**

జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలో మొత్తం 814 మంది విద్యార్థులకు గాను మొదటి రోజు ముగ్గురు గైర్హాజరయ్యారు. పట్టణంలోని నాలుగు పరీక్ష కేంద్రాలలో ఎపిటిడబ్ల్యూఆర్ఎస్‌లో 211 మందికి ఒకరు, సిఎహెచ్ స్కూల్‌లో 223 మందికి ఒకరు, శ్రీకృష్ణాపురం జిటిడబ్ల్యూ ఆశ్రమ బాలికల పాఠశాలలో 190 మందికి గాను ఒకరు గైర్హాజరయ్యారు. గవర్నమెంట్ హైస్కూల్‌లో 189 మందికి అంతా హాజరయ్యారు.

**డుంబ్రిగూడ:** మండలంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండల వ్యాప్తంగా కేజీబీవీ, గవర్నమెంట్ హైస్కూల్ తో పాటు మరో ఎనిమిది ఆశ్రమ పాఠశాలల నుంచి విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. మూడు పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. విద్యార్థులం దరూ పరీక్ష సమయానికి హాజర య్యారు. ఐటిడిఎ డిడి కొండలరావు పరీక్ష కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి.

**జి.మాడుగుల :** పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభ మయ్యాయి. మండల కేంద్రంలో నాలుగు పరీక్ష కేంద్రాలలో 597 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావలసి ఉండగా 593 మంది పరీక్ష రాశారు. నలుగురు పరీక్షకు హాజరు కాలేదని అధికారులు వెల్లడించారు.

**రంపచోడవరం :** మండలం కేంద్రంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో సోమవారం పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరినట్లు ఎంఇఒ సత్యనారాయణ తెలిపారు. సుమారు 300 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, వారిలో నలుగు గైర్హాజరైనట్లు తెలిపారు.



డుంబ్రిగుడలో పరీక్ష రాసి వస్తున్న పదో తరగతి విద్యార్థులు

### టెన్త్ ప్రశ్నాపత్రాల గందరగోళం

- తెలుగుకు బదులు హిందీ, ఉర్దూ ప్రశ్నాపత్రాలు
- పరీక్షను కోల్పోయిన విద్యార్థిని

**రాజవొమ్మంగి :** సోమవారం ప్రారంభమైన 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రశ్నాపత్రాల గందరగోళం చోటుచేసుకుంది. ఇద్దరు విద్యార్థులకు తెలుగు పశ్నాపత్రాలకు బదులు హిందీ, ఉర్దూ ప్రశ్నాపత్రాలు వచ్చాయి. దీంతో ఒక విద్యార్థిని పరీక్ష రాయలేని పరిస్థితి నెలకొంది. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పరీక్ష రాయడానికి వెళ్లిన నాగులాపల్లి అంజిబాబుకు తెలుగు ప్రశ్నాపత్రానికి బదులు బదులు ఉర్దూ ప్రశ్నాపత్రం, స్థానిక ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో పరీక్ష రాయడానికి వెళ్లి మజ్జి నూకరత్నంకు తెలుగు బదులు హిందీ ప్రశ్న పత్రాలు వచ్చినట్లు ఆ పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు తెలిపారు. ఈ ఇద్దరు విద్యార్థులు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న వారే.

మజ్జి నూకరత్నంకు హిందీ పేపర్ రావడంతో ఏమి రాయాలో తెలియక, పరీక్ష అనంతరం బయటకు వచ్చి బోరున విలపించింది. దీనిపై ఎగ్జామ్ హాల్‌లో సిఎస్ శ్రీనివాసరావును వివరణ కోరగా రాజవొమ్మంగి జిల్లా పరిషత్ హైస్కూల్లో చదువుతున్న నూకరత్నంకు 25 రోజుల క్రితమే హాల్ టికెట్లో హిందీ అని వచ్చినట్లు ఉందని, సంబంధిత ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది సరి చూసుకోలేదని తెలిపారు. నామినల్ రోల్, హాల్ టికెట్, ఓఎంఆర్ షీట్‌లో హిందీ ఉన్నట్లు వివరించారు.

కాగా జిల్లా పరిషత్ స్కూల్‌లో పరీక్ష రాస్తున్న మరో విద్యార్థి నాగులపల్లి అంజిబాబుకు తెలుగుకు బదులు ఉర్దూ పేపర్ రాగా అక్కడ చీఫ్ సూపరింటెండెంట్‌కి సదరు విద్యార్థి తెలియ పరచడంతో, ఆయన జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు తెలుగు పేపర్ ఇచ్చి పరీక్ష రాయించారు. పాఠశాల హెచ్ఎం, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తమ పిల్లల భవిష్యత్తు నాశనం అయిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్‌కె సలీం బాషాను వివరణ కోరగా ఇది సంబంధిత హెచ్ఎం తప్పిదమేనని తెలిపారు, విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# నిర్వాసితులందరికీ న్యాయం చేయాలి

### గ్రామసభలో ఎంపిపి, జెడ్‌పిటిసి

**ప్రజాశక్తి-విఆర్.పురం**

పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం కోల్పోయిన నిర్వాసితుల విషయంలో అధికారులు చొరవ తీసుకొని ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ విషయంలో వారికి న్యాయం చేయాలని ఎంపిపి కారం లక్ష్మి, జెడ్‌పిటిసి వాళ్ల రంగారావు డిమాండ్ చేశారు. మండలంలోని విఆర్ పురం గ్రామంలోని కెవిఆర్ కాలేజీ ఆవరణలో సర్పంచ్ నరసమ్మ అధ్యక్షతన సోమవారం ఆర్ అండ్ ఆర్ గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి, జెడ్పిటిసి మాట్లాడుతూ రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఇతర ఆధారాలన్నీ ఇక్కడే ఉండి బతుకు తెరువు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారికి కూడా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, ఇల్లు, ఇతర అన్ని సౌకర్యాలు వర్తింపజేయాలని కోరారు. సర్వే నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులకు ఆర్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, మొదటి అప్షన్ కోరుకున్న గిరిజనేతర నిర్వసితులకు ప్రభుత్వమే ఇల్లు కట్టాలని విజ్ఞప్తి చేశారు. నిర్వాసితులు ఇల్లు కట్టుకోవడానికి 2018లో నిర్ణయించిన ప్రకారం రూ.2.50 లక్షలు సరిపోవని, ఇప్పుడున్న ధరలను బట్టి రూ.6 లక్షలు ఇవ్వాలన్నారు. ప్రతి కుటుంబానికి ఆర్ అండ్ ఆర్ పరిహారం రూ.10లక్షలు చెల్లించాలని, గిరిజన నిర్వాసితులకు సారవంతం, నీటి సదుపాయం ఉన్న భూమిని కేటాయించాలని కోరారు.

తహశీల్దారు శ్రీధర్ మాట్లాడుతూ కాంటూరుతో సంబంధం లేకుండా మండలంలోని 11 గ్రామాలను తొలి ప్రాధాన్యత కింద గుర్తించడం జరిగిందని, ఈ 11 గ్రామాలలో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి 2022 సెప్టెంబర్10వ తేదీని కటాఫ్ తేదీగా తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. ఆర్ఆర్ ప్యాకేజీకి కుటుంబంలో 18 సంవత్సరాలు నిండిన వారందరినీ పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. గిరిజన నిర్వాసిత కుటుంబాలకు ఎటపాక మండలంలో ఇళ్లు నిర్మించి ఇవ్వనున్నట్లు తెలిపారు. గిరిజనేతర కుటుంబాలకు ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం, తాడ్వాయి గ్రామంలో ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి డబ్బులు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఇంటి స్థలం వద్దన్న వారికి స్థలానికి, ఇంటి నిర్మాణానికి అయ్యే సొమ్మును చెల్లిస్తామని పేర్కొన్నారు. ఈ గ్రామసభలో వైస్ ఎంపీపీ దుర్గాభవాని, చిన్నమట్టపల్లి సర్పంచ్ పిట్ట రామారావు, ఏసుబాబు, వీఆర్వో, గ్రామ కార్యదర్శ స్వరూపరెడ్డి, సచివాలయ సిబ్బంది లావణ్య గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపిపి కారం లక్ష్మి

# క్రికెట్ టోర్నీ విజేత చింతూరు బ్లూ స్టార్స్

**ప్రజాశక్తి-చింతూరు**

కూనవరం ఫర్ ది పీపుల్ యూత్ ఆధ్వర్యంలో కూనవరంలో నిర్వహించిన శ్రీఉమేష్ చంద్ర మెమోరియల్ మెగా క్రికెట్ టోర్నమెంట్ విజేతగా చింతూరు బ్లూస్టార్స్ జట్టు నిలిచింది. ఫైనల్ మ్యాచ్ చింతూరు బ్లూ స్టార్, విఆర్ పురం క్రికెట్ జట్లు మధ్య జరగ్గా, టాస్ గెలిచిన వి ఆర్ పురం జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన చింతూరు బ్లూ స్టార్స్ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 96 పరుగులు చేసింది. 97 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన విఆర్ పురం జట్టు 13 ఓవర్లకు 60 పరుగుల వద్ద ఆలౌట్ కావడంతో చింతూరు బ్లూ స్టార్ వారు విజయం సాధించారు. బ్లూ స్టార్ నుంచి చిట్టి 32 పరుగులతో రాణించగా బ్లూ స్టార్ బౌలర్ సుబ్రమణ్యం 4 వికెట్లు తీశారు. ఈ టోర్నీలో మూడవ స్థానంలో చింతూరు ఎ జట్టు నిలిచింది.



కప్‌తో విజేత జట్టు చింతూరు బ్లూ స్టార్స్



శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్త

# జీడిమామిడి సాగుపై రైతులకు శిక్షణ

**ప్రజాశక్తి- రంపచోడవరం**

జీడిమామిడి సాగుపై రంపచోడవరం మండలం పందిరిమామిడిలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం రైతులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జీడిమామిడి సాగులో ఎదురయ్యే సమస్యలు గురించి శాస్త్రవేత్తలు రాజేంద్ర ప్రసాద్ తెలియజేశారు. జీడిమామిడి పూత రావడం ఆలస్యం, పూత నల్లబడడం పిందే నుండి జిగిరు కారడం, వయసు పైబడిన మొక్కలు హఠాత్తుగా చనిపోవడం వంటి సమస్యలపై శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో కె.వీరాంజనేయులు, ఆర్ ప్రవీణ్‌బాబు, 120 మంది రైతులు పాల్గొన్నారు.

## నర్సీపట్నం మున్సిపల్ వైస్‌చైర్మన్ రాజీనామా

**ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :** గత పక్షం రోజులుగా అనేక మలుపులు, ఊహాగానాలకు పటాపంచలు చేస్తూ నర్సీపట్నం మున్సిపల్ వైస్‌చైర్మన్ గొలుసు నరసింహమూర్తి సోమవారం సాయంత్రం రాజీనామా చేశారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కనకారావుకు రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీ కోసమే కష్టపడి పనిచేస్తూ 2019లో నర్సీపట్నం ఎమ్మెల్యేగా పెట్ల ఉమా శంకర్ గణేష్‌ను గెలిపించుకున్నామన్నారు. అనంతరం 2021లో జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో మున్సిపాలిటీని వైసిపి కైవసం చేసుకోగా, ఎమ్మెల్యే ఆదేశానుసారం మునిసిపల్ వైస్‌చైర్మన్‌గా తాను ప్రమాణ స్వీకారం చేశానన్నారు. అప్పట్లో ప్రమాణ స్వీకారం రోజునే అనుకున్న ఒప్పందం ప్రకారం రెండేళ్ల తర్వాత చైర్మన్, వైస్ చైర్మన్ మార్పు జరుగుతుందని ఎమ్మెల్యే ప్రకటించారన్నారు. దాని ప్రకారం గత నెల 18వ తేదీకే రెండేళ్ల పదవీకాలం పూర్తయిందని, అందుకే రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కొన్ని రోజులు రాజీనామా ఆలస్యానికి కారణాన్ని వివరిస్తూ, మార్చి 29న కౌన్సిల్ సమావేశం ఉన్నందున అప్పటివరకు వేచివున్నా, ఇపుడు రాజీనామాను అందజేశానన్నారు. ఎమ్మెల్యేతో తనకు ఎటువంటి అభిప్రాయ భేదాలు లేవనిస్పష్టం చేశారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉద్దేశపూర్వకంగానే రాజీనామా చేసినట్లు నరసింహమూర్తి వెల్లడించారు. కార్యక్రమంలో మరో మున్సిపల్ వైస్‌చైర్మన్ తమరాన అప్పలనాయుడు, వైసిపి పట్టణ అధ్యక్షుడు యాకా శివ, కౌన్సిలర్లు బోడపాటి సుబ్బలక్ష్మి, పీలావెంకటలక్ష్మి, జగదీశ్వరి, మాకిరెడ్డి బుల్లిదొర, బైపురెడ్డి చినబాబు, కోఆప్షన్ సభ్యులు షేక్ రోజా పాల్గొన్నారు.

## ఒప్పంద ఉద్యోగుల నిరసన

**ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:** వేతన బకాయి చెల్లింపు, ఉద్యోగ భద్రత, క్రమబద్ధీకరణ ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులు సోమవారం భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులకు ఫిబ్రవరి, మార్చి నెలల వేతనాలు చెల్లించలేదని, వేతనాల పెంపు, ఉద్యోగాల క్రమబద్ధీకరణ, కనీస వేతనాల అమలు, పిఎఫ్, ఇఎస్ఐ, ఆరోగ్యభద్రత, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కో డేటా ఎంట్రీ ఆపరేటర్, మండల లెవెల్ అకౌంటెంట్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్, ఐఇఆర్‌టిలు, పిటిఐలు, మెసెంజర్స్, ఆయాలు, కెజిబివి పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## వైసిపి పాలనలో పంచాయతీలు నిర్వీర్యం

**ప్రజాశక్తి-మాడుగుల:** వైసిపి ప్రభుత్వంలో పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యమైందని టిడిపి ప్రధాన కార్యదర్శి పుండూరు దేముడు ఆరోపించారు. సోమవారం స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో పంచాయతీ సర్పంచుల రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా టిడిపి ఆధ్వర్యాన నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చినప్పటి నుండి పంచాయతీ సర్పంచులకు పూర్తి స్వేచ్ఛ, హక్కులు ఉండేవని, పంచాయతీ పరిధిలో జరిగే ప్రతి పనుల్లో సర్పంచ్, పాలకమండలి ఆమోదంతోనే జరిగే పరిస్థితి ఉండేదన్నారు. కానీ వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామపంచాయతీలకు నిధులు, విధులు లేకుండా నిర్వీర్యం చేసేశారని, పంచాయతీల్లో తాగునీరు, పారిశుధ్య పనులు, వీధిదీపాలకు సైతం నిధులు లేని దౌర్భాగ్య పరిస్థితి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు కేటాయించిన ఆర్థిక సంఘ నిధులను సైతం వైసిపి ప్రభుత్వం తస్కరించడం దుర్మార్గమన్నారు. సర్పంచుల బాధ్యతలు చేపట్టిన గడచిన రెండేళ్లలో పంచాయతీలలో ఒక్క పని కూడా చేయలేకపోవడానికి ఇదే ప్రధాన కారణమని ఆవేదన వ్యక్తం చేశారు.

## 16న రాష్ట్ర సదస్సుకు తరలిరండి

**ప్రజాశక్తి-గొలుగొండ :** ఈ నెల 16న విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో సామాజిక విప్లవ రణభేరి రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ పుత్తడి గైరంపేటలో టిడిపి జైభారత్ సంస్థ ఆధ్వర్యంలో సర్పంచ్ పల్లి రమణ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జైభారత్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జివి.రమణ మాట్లాడుతూ కులవివక్ష నిర్మూలన, అసమానతల అంతమే లక్ష్యంగా జైభారత్ ఎస్‌సి, ఎస్‌టి, బిసి పోరాటసంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సుకు ఉద్యమ అభిమానులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎం.త్రిమూర్తులు, పుత్తడి నానాజీ, పోసగంటి గణేష్, రావుల కొండలరావు, పల్లి మల్లేష్, పుత్తడి శ్రీను, రమణ పాల్గొన్నారు.

## పెద్దచెరువు ఆక్రమణపై స్పందనలో ఫిర్యాదు

**ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్ :** నర్సీపట్నం కేడీపేట రోడ్డు మార్గంలో పెద్ద చెరువు మదుం వద్ద ఆక్రమించి ఇల్లు నిర్మాణం చేపట్టడంపై శివపురానికి చెందిన ఏకా వీర వెంకట సత్యనారాయణ సోమవారం స్పందనలో ఆర్‌డిఒ జయరాంకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ చెరువులోకి నీరు వచ్చే కాలువను కబ్జా చేసి రోడ్డు వేసుకున్నారన్నారు. దీనిపై అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

# జాబ్ కార్డుదారులందరికీ ఉపాధి

**జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం**



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

**ప్రజాశక్తి - పాడేరు:** జాబ్ కార్డు కలిగిన ప్రతి గిరిజన కుటుంబానికీ ఉపాధి కల్పించాలని, తద్వారా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యాలను అధిగమించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్సు హాల్ నుంచి జిల్లాలోని 22 మండలాల ఎంపిడిఒలు, తహశీల్దారులు, ఉపాధి ఎపిఒలు, ఇంజనీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి హామీ పనులు, డి పట్టాల పంపిణీ, మన బడి నాడు నేడు పనుల పురోగతి, సమగ్ర భూ రీసర్వే, పన్నులు వసూళ్లు, ఆధార్ నవీనీకరణ, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్, మే, జూన్ నెలలో ఉపాధి హామీ పనులను పెద్ద ఎత్తున చేయాలని సూచించారు. జాబ్ కార్డున్న గిరిజన కుటుంబానికి రూ.25 వేల వేతనం అందిలా ఉపాధి పనులు కల్పిస్తే, వచ్చే ఖరీఫ్‌లో వ్యవసాయ పనులకు ఉపయోగపడుతుందన్నారు. గతంలో పనులు జరగని గిరిజన గ్రామాల్లో విధిగా ఉపాధి కల్పించాలని, నూరుశాతం పనులు కల్పించేలా ప్రణాళికా బద్ధంగా ముందుగా పనులు కల్పించాలని సూచించారు. ఉపాధి జబ్ కార్డులకు, బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేయాలని ఆదేశించారు.ఉపాధి హామీలో చెరువులు, కాలువల్లో పూడికతీత పనులు చేపట్టడం ద్వారా వ్యవసాయ భూములకు సాగునీరందుతుందన్నారు. ఆధార్ కార్డులేని వారికి మొబైల్ ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసి ఆధార్ కార్డులు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇంటి పన్నుల వసూళ్లు చేయాలని స్పష్టం చేసారు.

**నిధులు దుర్వినియోగం జరిగితే చర్యలు....**

మన బడి నాడు నేడు పనుల్లో నాణ్యతలు పాటించాలన్నారు. మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సదుపాయాలు, విద్యుత్ సౌకర్యం పనులు పక్కాగా చేయాలని సూచించారు. విద్యుత్తు పరికరాలు, తాగునీటి పైపులు, నిర్మాణ సామగ్రితో నాణ్యమైన వస్తువులు కొనుగోలు చేయాలన్నారు. నాసిరకం వస్తువులు కొనుగోలు చేసి నిధులు దుర్వినియోగం చేస్తే చట్టపరమైన కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మన బడి నాడు నేడులో చేసిన పనులు విద్యార్థులకు ఉపయోగపడేలా నాణ్యతతో చేపట్టాలని ఆదేశించారు.

**అర్హులైన గిరిజనులకు డి పట్టాలు**

డి. పట్టా భూములను గుర్తించి ఎస్టాబ్లిష్‌మెంట్ కమిటీ దృష్టికి తీసుకెళ్లి గిరిజన రైతులకు పంపిణీకి తాహశీల్దారులు చొరవ చూపాలని ఆదేశించారు. భూములు సర్వే చేసి సబ్ డివిజన్ చేయాలన్నారు. ఆదాయ, కులధ్రువీకరణల జారీలో జాప్యం వద్దని ఆదేశించారు. సుస్థిరాభివృద్ధి (ఎస్‌డిజి) లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు.

**వేసవిలో ఆరోగ్యం జాగ్రత్త.**

మండల కేంద్రాలు, పిహెచ్‌సిల పరిధిలో వైద్యశిబిరాలు నిర్వహించాలని సూచించారు. ఈనెల 1న కలెక్టరేట్ వద్ద నిర్వహించిన వైద్యశిబిరంలో 340 మంది ఉద్యోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారన్నారు. ఎక్కువ మంది ఉద్యోగులు మధుమేః, అధికరక్తపోటు వ్యాధితో బాధపడుతున్నారని, వేసవిలో అప్రమత్తంగా ఉంటూ ఆరోగ్యపరమైన జాగ్రత్తలు పాటించాలన్నారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ జె. శివశ్రీనివాసు, సబ్ కలెక్టర్ వి.అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ అసుతోష్ శ్రీవాత్సవ, డిఆర్ఒ అంబేద్కర్, సర్వే సహాయ సంచాలకులు వై.మోహనరావు, డ్వామా పిడి రమేష్ రామన్, డిపిఒ కొండలరావు, డివిజనల్ పంచాయతీ అధికారి పిఎస్ కుమార్, ఎపిడి జె. గిరిబాబు, పిఎంయు ప్రోగ్రాం అధికారి రాంగోపాల్ పాల్గొన్నారు.

# గిరిజన యువత క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జెడ్‌పిటిసి మత్స్యలింగం

**ప్రజాశక్తి -హుకుంపేట:** గిరిజన యువత క్రీడల్లో రాణించాలని జెడ్‌పిటిసి రేగం మత్స్యలింగం అన్నారు. సోమవారం మోదకొండమ్మ పండుగ సందర్భంగా కమిటీ సభ్యులు నైని.సత్తిబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ప్రారంభ పోటీలోని ఇరుజట్ల క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.

ఈ సందర్భంగా జెడ్‌పిటిసి మత్స్యలింగం మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో యువత అన్నిరంగాల్లో నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. క్రీడల్లో నైపుణ్యత సాధిస్తే ఉన్నతస్థాయికి చేరేందుకు అవకాశాలున్నాయన్నారు. క్రికెట్ టోర్నీలో విజేతలకు మొదటి బహుమతి కింద రూ.50వేలు ఆర్థికసాయాన్ని అందిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీకి జెడ్‌పిటిసి రూ.50వేలు మొదటి బహుమతికి ఆర్థికసాయం ఇస్తే, రన్నరప్‌కు రూ.25వేలు నగదు బహుమతికి ఒంటుబు శామ్యూల్ ఆర్థికసాయాన్ని సమకూరుస్తారన్నారు. కార్యక్రమంలో కిలగాడ సింహాచలం, పాంగి సాంబ, రాపా ఎంపిటిసి నాగలక్ష్మి , సర్పంచ్‌లు బెటికేరి మత్స్యరాజు, ధనసాని సత్యవతి, సోమెల శాంతకుమారి, పాటి లక్ష్మి, మగ్రి చినారావు, సర్పంచ్ ప్రతినిధులు దూసూరి.వెంకట్, పూజారి సుబ్బారావు, కోరబు వెంకట్, ధనుసాని మురళీమోహన్, గోమంగి. చిన్నశ్వరరావు, క్రికెట్ టోర్నీ నిర్వాహకులు కొర్ర నాగబాబు, శివాజీ, రాము, సాయి, సూర్యశేఖర్, రామయ్య పాల్గొన్నారు

## నేరాలు ఘోరాలు

## గిరిజనుడి సజీవ దహనం

**ప్రజాశక్తి -దుంబ్రిగుడ:** మండలంలోని కితలంగి పంచాయతీ వయా గ్రామంలో చెట్టు కింద సేదదీరుతున్న గిరిజనుడిపై దాడి చేసి, పెట్రోల్ పోసి సజీవ దహనం చేసిన దారుణమైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి స్థానిక గ్రామస్తుల కథనం ప్రకారం వయా గ్రామంలోని గొల్లోరి గోవింద్ (42) అనే గిరిజనుడు సోమవారం గ్రామానికి సమీపంలోని పొలాల్లో పశువులు కాస్తూ, మధ్యాహ్నం చెట్టు కింద నీడలో పడుకుని సేదదీరుతుండగా, కొంతమంది వ్యక్తులు ఆకస్మిక దాడి చేసి, పెట్రోల్ పోసి సజీవ దహనం చేశారు. గ్రామస్తుల సమాచారం మేరకు స్థానిక సిఐ జెడి.బాబు, ఎస్ఐ సంతోష్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని, మృతికి కారణాలపై వివరాలను సేకరిస్తున్నారు. ఘటనకు పాల్పడింది, ఎవరు, ఎందుకనే విషయాలపై స్పష్టత లేనప్పటికీ, ఈ దారుణానికి కుటుంబ, భూతగాదాలే కారణమై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. పోలీసుల దర్యాప్తులో వాస్తవాలు తెలియాల్సి ఉంది. మృతునికి, భార్య నలుగురు పిల్లలు ఉన్నారు. కుటుంబ యజమాని దుర్మరణంతో భార్య ,పిల్లలు బోరున విలపిస్తున్నారు. పట్టపగలే ఇలాంటి దారుణ ఘటన చోటుచేసుకోవడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు.



రాజేంద్రప్రసాద్‌ను అభినందిస్తున్న సత్యనారాయణ

## రాజేంద్రప్రసాద్‌ను కలిసిన అండిబ సర్పంచ్

**ప్రజాశక్తి -హుకుంపేట :** ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వైబి.రాజేంద్రప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి కతజ్ఞతలు తెలియజేసినట్లు అండిబ సర్పంచ్ టిఎన్ఎస్ఎఫ్ అరకు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు తామర్ల సత్యనారాయణ తెలిపారు. ఈసందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై తగు సూచనలు చేశారన్నారు. అరకు వ్యాలీ, పాడేరు పర్యటనలో భాగంగా వారి బృందాన్ని కలిసినట్లు వెల్లడించారు.

## చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలి

**ప్రజాశక్తి-గొలుగొండ :** చిరుధాన్యాల సాగుపై రైతులంతా దృష్టి సారించాలని నర్సీపట్నం డివిజన్ అగ్రికల్చరల్ డైరెక్టర్ మోహన్‌రావు అన్నారు. సోమవారం మండలంలో జోగంపేట ఆర్‌బికెను సందర్శించారు. కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుపై కేంద్ర ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలు అందిస్తోందని, రైతులు రాగులు, గంటెలు, కొర్రలు వంటి చిరుధాన్యాల సాగుపై దృష్టి పెట్టాలని కోరారు. పోషకాలు ఎక్కువగా ఉన్న చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడానికి ప్రజలు మొగ్గు చూపుతున్న పరిస్థితుల్లో వీటికి మంచి డిమాండ్, ధర ఉంటుందన్నారు. చిరుధాన్యాల సాగుపై సూచనలు సలహాలు చేశారు. కార్యక్రమంలో జోగంపేట సచివాలయ అగ్రికల్చరల్ అసిస్టెంట్ సత్యవేణి, వైసిపి నాయకులు జక్కు చిన అప్పలస్వామి నాయుడు, పెద్దిరెడ్ల అప్పలనాయుడు పాల్గొన్నారు .

## జగనన్న కాలనీలో వాలిపోయిన విద్యుత్ స్తంభాలు

**ప్రజాశక్తి-రోలుగుంట :** రోలుగుంట మండలం కొమరవోలు గ్రామంలో జగనన్న కాలనీలో వేసిన విద్యుత్ స్తంభాలు ఇటీవల వీచిన ఈదురుగాలులకు వాలిపోయాయి. ఇక్కడ ఈ స్తంభాలు ఏర్పాటు చేసి నెల రోజులు మాత్రమే కావస్తోంది. చిన్నపాటి వర్షాలకు ఈదురుగాలలకు సైతం స్తంభాలు ఈ విధంగా వాలిపోవడంపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.



ఉత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు

## ఘనంగా సీతారామచంద్ర స్వామి వసంతోత్సవం

**ప్రజాశక్తి- విఆర్.పురం**

మండలంలోని శ్రీరామగిరి ఆలయంలో శ్రీరామనవమి ఐదు రోజులు ఉత్సవాల్లో భాగంగా ఆఖరి రోజు సోమవారం శ్రీసుందర సీతారామచంద్రస్వామి వారి చక్రస్థానం, అనంతరం స్వామివారి వసంతోత్సవం కన్నుల పండుగ నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయం నుండి శ్రీసీతారామచంద్రస్వామి వారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం స్వామి వారి కళ్యాణ మండపంలో చక్రస్థానం, స్వామివారి వసంతోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పులి సంతోష్ కుమార్, ఉప సర్పంచ్ దుర్గారావు, మాజీ ఉపసర్పంచ్ లక్ష్మణరావు విఆర్ పురం ఎస్సై దుర్గాప్రసాద్, కూనవరం ఎస్సై వెంకటేష్, ఆలయ జూనియర్ అసిస్టెంట్ సాయిబాబు, ఆలయ కమిటీ అధ్యక్షులు రేవు బాలరాజు, జీడిపప్పు ఎంపిటిసి వాళ్ళ వెంకటేశ్వర రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు కమ్మచిచ్చు చిన్న వెంకటేశ్వర్లు, ఆత్మకూరు కాంతారావు, నాల్లరపు లక్ష్మణరావు, మాసిన పోసిబాబు భక్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

**వైభవంగా రాములవారి పట్టాభిషేకం**

**సీలేరు :** జీకే వీధి మండలం సీలేరు రామాలయంలో సోమవారం రాముల వారి పట్టాభిషేకం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారికి పూజా కార్యక్రమాలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం బజరంగీ కోలాటం గ్రూపు ప్రదర్శనలో మహిళలు పాల్గొని ఆటపాటలతో అలరించారు. వారి ప్రతిభను గుర్తించి ఏపీ జెన్కో ఈఈ లక్ష్మీనారాయణ, స్థానిక ఎస్సై రామకృష్ణ సిఆర్‌పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్ మహిళలకు బహుమతులు అందజేశారు. అనంతరం స్వామి సన్నిధిలో అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు.



వినతులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్

## స్పందనకు 20 అర్జీలు

**ప్రజాశక్తి - రంపచోడవరం :** స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 20 అర్జీలు వచ్చాయి. ఈ వినతిపత్రాలను సబ్ కలెక్టర్ శుభం బన్సల్ స్వీకరించారు. ఏజెన్సీలో గిరిజనుల నుండి గిరిజనేతరులు బినామీల పేరుమీద భూ కొనుగోలును అరికట్టాలని, రెవెన్యూ రికార్డుల ప్రకారం రీ సర్వే చేసి, బాధిత గిరిజనులకు న్యాయం చేయాలని, ఏజెన్సీలో ఆక్రమణలు నివారించాలని తదితర డిమాండ్లతో పాటు కరెంటు సౌకర్యం, రహదారులు, నిరుద్యోగులకు ఉద్యోగాలు వంటి సమస్యలపై వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డిఎస్ శాస్త్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.డేవిడ్ రాజు. నాగేశ్వరరావు, ఎండి యూసఫ్, జిసిసి మేనేజర్ మురళి, నాగరాజురెడ్డి, డాక్టర్ గోపిక, డాక్టర్ రాధిక, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్రపై టిడిపి దృష్టి

**బిసి నేతలతో విశాఖలో సమావేశం**
**5న పిఎం.పాలెంలో సదస్సు**
**హాజరుకానున్న పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు**

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**

శాసన మండలి ఫలితాలతో ఉత్తరాంధ్రలో తెలుగుదేశం పార్టీకి జవసత్వాలు వచ్చినట్టయింది. 2019 ఎన్నికల తర్వాత అంతా వైసిపి హవాయే నడుస్తోందని భావించిన నాయకులు, కార్యకర్తల్లో తాజాగా 'మండలి' గెలుపు ఒక ఊపునిచ్చిందనే చెప్పొచ్చు. ఇదే తడవుగా ఆ పార్టీ అధిష్టానం ఉత్తరాంధ్ర బిసి నేతలతో విశాఖలో సోమవారం ఒక సమావేశం నిర్వహించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ తరహా ఉత్సాహం వైసిపిలో నేడు కానరావడం లేదు. అధికారం తమ చేతిలో ఉండడంతో వారి ప్రాధాన్యతలు సమీకరణలపై ప్రస్తుతం లేవు. టిడిపి రాష్ట్రంలో 2019 ఎన్నికల్లో ఘోరంగా పరాజయం పాలైంది. అయితే, విశాఖలో నాలుగు అసెంబ్లీ సీట్లు దక్కించుకుని బెటర్ అనిపించుకుంది. ఆ తరువాత చోటుచేసుకున్న పరిణామాలతో మొత్తంగా పార్టీ చచ్చిపోయిందనే ఆ పార్టీ కార్యకర్తలంతా భావిస్తున్న తరుణంలో మండలి ఫలితాలు చీకట్లో దివిటీ మాదిరిగా వారికి కనిపించాయి.

**ఉత్తరాంధ్ర ఊపుతో రాష్ట్ర మంతటా సభలు**

ఉత్తరాంధ్ర ఫలితాలతో టిడిపి నిస్తేజం నుంచి లేచినట్టయింది. దీంతో సమావేశాల ఊపు పెంచింది. ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఈ నెల 5న ఉత్తరాంధ్రకు చెందిన ముఖ్య నేతలు, కార్యకర్తలతో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పిఎంపాలెంలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో పార్టీ సమీక్షా సమావేశం, చర్చల్లో పాల్గొనేందుకు విచ్చేస్తున్నారు. పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం నింపేందుకు చంద్రబాబు ఈ విధంగా ప్రయత్నాలు ప్రారంభించారు. జగన్ పాలనపై జనంలో అసంతృప్తి కనిపించడం, భవిష్యత్తులో పొత్తు పొడిచే అవకాశాలున్న జనసేన సభలకు జన స్పందన రావడంతో కలిసొచ్చే అంశంగా టిడిపి భావిస్తోంది. బిసిల్లో ఉండే చిన్న తరగతుల సమస్యలను అధికారంలో ఉన్నప్పుడు గాలికొదిలేసిందన్న ఆరోపణలు టిడిపిపై లేకపోలేదు. ఇప్పుడు వారిని దగ్గర చేసుకునేందుకు ప్రయత్నిస్తోంది.

**ఎమ్మెల్సీ ఫలితాలు టిడిపి సొంత ఘనతా ?**

ఇప్పటికే ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కొంతమంది నిరుద్యోగ పట్టభద్రులు జగన్ పాలనతో విసుగు చెందిన సంగతి తెలిసిందే. దీంతో ప్రత్యామ్నాయం కోసం చూసి మండలి ఎన్నికల్లో టిడిపికి ఓటేశారు. ఉత్తరాంధ్రలో తమ నాయకులపై ప్రభుత్వ నిర్బంధం అంటూ చేసిన ఆందోళన, అలజడులు మినహాయిస్తే ప్రజా సమస్యలపై టిడిపి పోరాడిందెక్కడా లేదు. అయినప్పటికీ వైసిపి నిరంకుశపాలన, విధానాలు తెలుగుదేశంకు మండలి ఎన్నికల్లో ఓటేసేలా చేశాయి.

**గంటా యాక్టివ్**

మండలి ఫలితాల సరళి అనంతరం మాజీ మంత్రి, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్సీ గంటా శ్రీనివాసరావు పార్టీ కార్యక్రమాల్లో కనిపిస్తున్నారు. తాను స్టీల్‌ప్లాంట్ పోరాటంలో పాల్గొనడం కోసం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పి విశాఖ నుంచి రెండేళ్ల పాటు పత్తాలేకుండా పోయిన గంటా... మరలా ఆ పార్టీలో తన సామాజిక తరగతిని అడ్డం పెట్టుకుని రింగు తిప్పేందుకు సిద్ధమయ్యారు. అంతకు మునుపు వరకూ టిడిపిని లెక్క కూడా చేయకుండా ముఖం చాటేశారు. తాజాగా రాజకీయాల్లో ఆయన తళుక్కుమనడంలో మరో సీనియర్ నేత చింతకాయల అయ్యన్న పాత్రుడు పార్టీ కార్యక్రమాల్లో తన చురుకుదనాన్ని తగ్గించారు. తొలినుంచీ వీరిద్దరి మధ్య ఈ వైరం మెయింటైన్ అవుతున్న విషయం తెలిసిందే. కులాల వారీగా, ప్రాంతాల వారీగా సమీక్షలు, సమావేశాలు జరిపి పార్టీ శ్రేణుల్లో ఉత్తేజం నింపేందుకు టిడిపి ప్రయత్నిస్తున్నట్టు తాజా పరిణామాలతో అర్థమవుతోంది.

# కేంద్ర ప్రభుత్వ భారాలపై సిపిఎం నిరసన

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** కేంద్ర ప్రభుత్వం తాజాగా యుపిఐ లావాదేవీలపై వేసిన పన్నును, టోల్‌ఛార్జీల పెంపును రద్దు చేయాలని, మందుల ధరలను పెంచుతూ చేసిన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిపిఎం జగదాంబ జోన్ కన్వీనర్ ఎం.సుబ్బారావు అధ్యక్షతన వినూత్న రీతిలో పార్టీ కార్యకర్తలు నిరసన తెలిపారు. పార్టీ కార్యాలయం నుంచి జగదాంబ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు వై.రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెద్ద నోట్లు రద్దుచేసి, క్యాష్‌లెస్ ట్రాన్సిక్షన్ పద్ధతి ప్రవేశపెట్టి గూగుల్ పే, ఫోన్ పే యాప్స్ ద్వారా కొనుగోలు, అమ్మకాలను ప్రోత్సహించిందన్నారు. తద్వారా కోట్లాది రూపాయలు అమెరికా కంపెనీలకు ధారాదత్తం అవుతున్నాయన్నారు. దీనికి తోడు ఈ సేవలపైన యూజర్ ఛార్జీలు వేయడం దారుణమన్నారు. పెంచిన టోల్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. ఒక పక్క జీతాలు పెరగకపోవడం, మరోపక్క భారాలు పెరగడం, రూపాయి విలువ క్షీణించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు.

# చింతూరు సంతకు వేలం పాట

**రూ.5.99 లక్షలకు దక్కించుకున్న బాబా ఎస్ఎస్‌జి గ్రూప్**

**ప్రజాశక్తి - చింతూరు :** మండల కేంద్రంలోని సంతకు వేలం పాట పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. సంత వేలంపాట దక్కించుకునేందుకు పలువురు పోటీపడగా, చివరకు రూ5.99 లక్షలకు చింతూరు బాబా ఎస్ఎస్‌జి గ్రూప్ దక్కించుకుంది. గతంలో రూ.3.90 లక్షలు ఉన్న పాట గరిష్టంగా పోటీదారులు ముందుకు రావడంతో ఈ ఏడాది రూ.5.99 లక్షలకు వెళ్లింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, అనిల్ కుమార్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెవి.సత్యనారాయణ మూర్తి

## పోలవరం ముంపు ప్రాంత గిరిజనులకు తీరని అన్యాయం

**ప్రజాశక్తి - సీలేరు :** పోలవరం ముంపు ప్రాంత గిరిజనులకు రాష్ట్ర ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి విమర్శించారు. జీకే వీధి మండలం సీలేరులో సోమవారం జరిగిన సిపిఐ మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలవరం ముంపు ప్రాంతమైన గోదావరికి ఎడమవైపున 90 శాతం మంది గిరిజనులు ఉన్నారని, వారికి ఎకరాకు లక్షా 15 వేల రూపాయలు ఆర్థిక సహాయం ఇవ్వగా, కుడివైపున గిరిజనేతరుల సంఖ్య అధికంగా ఉండగా, వారికి ఎకరాకు రూ.10.80లక్షలు ప్రభుత్వం అందజేసిందని తెలిపారు. ఎకరాకు రూ.5 లక్షలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన వైఎస్.జగన్, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం సహాయం చేస్తే తప్పా తన చేతిలో ఏమీ లేదని చెప్పడం గిరిజనులను మోసగించడమే అవుతుందన్నారు. ఈ అన్యాయంతో పాటు ఇప్పుడు బోయ వాల్మీకి, బొంతు జాతులను ఎస్‌టి జాబితాలో చేర్చుతూ అసెంబ్లీలో తీర్మానం చేసి మరో అన్యాయానికి ఒడిగట్టిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ చర్యలను సిపిఐ పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సత్యనారాయణ, సహాయ కార్యదర్శి స్వర్ణ, మహిళా సమైక్య కార్యదర్శి అత్తిలి విమల, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం రాజబాబు, ఎస్‌వి.మూర్తి, మండల కార్యదర్శి కె.సత్తిబాబు, ఇరువాడ దేవుడు, రాధాకృష్ణ, సింహాచలం, జి.రాజబాబు, సతీష్ పాల్గొన్నారు.

## చెట్టును ఆటో ఢీకొని మహిళ మృతి

**ప్రజాశక్తి-విఆర్.పురం :** ఆటో చెట్టును ఢీకొన్న ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా, నలుగురికి గాయాలైన సంఘటన మండలంలోని రేఖపల్లి శివారులో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... మండలంలోని శ్రీరామగిరిలోని శ్రీరామనవమి ఆఖరి రోజు ఉత్సవాలను తిలకించడానికి గుర్రంపేట గ్రామం నుండి ఆటోలో పదిమంది భక్తులు వచ్చారు. దేవుడి దర్శనం అనంతరం తిరిగి ఆటోలో వెళ్తుండగా రేఖపల్లి గ్రామ చివరిలో ఆటో చెట్టును ఢీకొని పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు గాయపడగా, వారిని కూనవరం మండలంలోని కోతులగుట్ట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో గుర్రంపేట గ్రామానికి చెందిన చిచ్చడి గౌరమ్మ (45) మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గౌరమ్మకు భర్త సహదేవ్, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎంపిపి కారం లక్ష్మి, రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని, చిన్నమట్టపల్లి ఎంపిటిసి పూనెం ప్రదీప్ కుమార్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, ఇతర నాయకులు క్షతగాత్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓవర్ స్పీడ్ వల్ల చాలా ప్రమాదాలు జరుగుతున్నాయని, పోలీస్ అధికారులు తగిన చర్యలు తీసుకొని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

## అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

**ప్రజాశక్తి-చింతూరు :** చింతూరు ఐటీడీఏ పరిధిలో ఖాళీగా వున్న అంగన్వాడీ పోస్టులకు సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో ఇన్‌ఛార్జి పీవో సూరజ్ గనోరే సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. చింతూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 7, కూనవరం ప్రాజెక్టు పరిధిలో 5 పోస్టులకు ఈ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ పోస్టులను మెరిట్ ఆధారంగా త్వరలోనే భర్తీ చేయనున్నట్లు పీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ పుల్లయ్య, చింతూరు సీడీపీవో విజయగౌరి, కూనవరం సీడీపీవో విమల పాల్గొన్నారు.

## పోలీస్ స్పందనకు 59 ఫిర్యాదులు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 59 మంది నుంచి ఫిర్యాదులు అందాయి. సిపి శ్రీకాంత్ ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పోలీసు శాఖలోని పలువురు అధికారులు పాల్గొన్నారు.